# గుండుసూది

నీటిమీద తేలే మంచుగడ్డకన్నా తొమ్మిదిరెట్లు మంచు గడ్డ నీటికింద కనిపించకుండా ఉంటుందట! మానవుడి జీవి తమూ అలాగే మరి!...ఎంతదగ్గరవాళ్ళయినా అతని జీవితం లోని నిజంలో పది శాతం కూడా చూడలేకపోతారు. కంటికి కనిపించేదే మనసుకి అర్థం అవుతుంది. మనసుకి అర్థం అయేదే భావనకి పునాదులు వేస్తుంది. అయినా, ఏదో బాగానే అన్ని జీవితాలు సాగిపోతూ ఉంటాయి...ఏది నిజము అన్నదాని కన్నా, ఏది నిజమని అందరూ అనుకుంటారో అది ముఖ్యం... నిజానికి అదే నిజం! అందుచేతనే సమాజంలో మనిషి తన నిజ జీవితానికి యితరుల దృక్పథాల బట్టలు కట్టి బతకగలుగు తున్నాడు.

శేషగిరి జీవితాన్నే తీసుకుని పరిశీలించండి. సామాన్య పరిశీలనకి అతను అదృష్టవంతుడిగానే కనిపిస్తాడు. పెద్దది కాక పోయినా మంచిదే ఒక యిల్లు వుంది. అంత గొప్పది కాక పోయినా గౌరవమైనదే. అతనికి ఉద్యోగం వుంది-అదీ ఉన్న వూళ్ళోనే! పెద్ద అందగత్తె కాకపోయినా, గుణవంతురాలయిన భార్య వుంది...అతని మనస్సుని అర్థం చేసుకుని ప్రవర్తించే శీలం ఆమెకి వుంది.

అతని సంసారం సరిఅయిన సైజులో ఆదర్శవంతంగా వుంది...ఒక కొడుకూ, వాడికన్న పెద్దది ఒక అమ్మాయీని.

అతని ఆరోగ్యము బాగుంటుంది-చీటికీ మాటికి వైద్యుడి దగ్గరికి అతనూ వెళ్ళక్కరలేదు. అతని కుటుంబంలో ఎవ్వరూ వెళ్ళక్కరలేదు.

ఇలాటి పరిస్థితులన్ని గమనించే శేషగిరి మిత్రులు "నీకేమోయ్ అదృష్టవంతుడివి!" అంటారు. శేషగిరి ఆ సందర్భాల్లో ఇబ్బందిపడిపోయి, అదృష్టానికేంలే! నా బాధలు నాకున్నాయి" అంటాడు. కాని, అవతలివాళ్లు అది నమ్మక "నీ అబద్ధాలు మాకు తెలుసు లేవోయి-అన్నీ బాగున్న వాళ్ళకి అలా అనడం ఓ జబ్బు!" అని స్ఫురించేలాగ, నవ్వి, "ఆ! ఇబ్బందులు నీకు లేకేం కనిపిస్తూనే వున్నాయిగా!" అని కళ్లు ఓ సారి ఎగరేసి వెళ్లిపోతారు.

అలాటి సమయాల్లో తనజీవితాన్నిగురించి ఆలోచించి బాధపడతాడు శేషగిరి...అతనికి తన జీవితం గుండుసూదులు గుచ్చిపెట్టే పిన్‌కుషన్ లాటిదని అనిపిస్తూంది. వరండాలో వాలుకుర్చీలో కూర్చుని అతని ఆలోచనల్లో అతను వుంటాడు.

"ఏమండీ; ఒంట్లో బాగులేదా!" అని అడుగుతుంది. వెనకాల నిలబడి శేషరత్నమ్మ.

తన జీవితంలో గుచ్చిన మొదటి గుండుసూది ఆమే, అనిపిస్తుంది. అతనికి పరిచయం వున్న రాగప్రియ జ్ఞాపకం వొస్తుంది.

రాగప్రియ !

ఎంత చక్కటి పేరు! మనిషి దానికి తగినట్లుగానే వుండేది. 'ప్రియా ప్రియా' అని పిలుచుకుంటూ, ఆమెని ప్రతీ క్షణమూ తనదానిగా ఆనందించే అదృష్టం శేషగిరికి పట్టలేదు.

"తలనొప్పి మందు కావాలా ?"

మళ్లీ భార్య గొంతుక.

"వొద్దులే-ఏమీలేదు...నీపని చూసుకో." అని ఆమెని పంపేస్తాడు. ఈ జీవితంలో ప్రతివాడికి వుండేది తలనొప్పి మాత్రమేననీ, దానికి ఒకే ఒక మందు అనీ ఆమెఉద్దేశం.

అటు కొబ్బరిచెట్ల వెనకాలనించి చంద్రుడు కనిపిస్తోంటే, ఇలాటి సంఘటన మరోసారి జరిగినరోజు శేషరత్నమ్మని ఇంట్లోకి పంపేక శేషగిరి మళ్ళీ ప్రియగురించిన ఆలోచనల్లో పడ్డాడు ఆ రోజుల్లా ఆమె తనతో చాల చనువుగా వుండేది. నిజానికి, తానంటే ప్రాణం పెట్టేది. ఒక్కరోజు ఆమె కాలేజికి రాకపోతే తనకితోచేది కాదు...తాను ఒక్క రోజు కనిపించక పోతే రాగప్రియ తన ఆతృతని దాచేదికాదు!

ఎన్నోసార్లు ఆమెకి తన హృదయంలో వుడికిపోతోన్న ఆలోచన లన్నిటినీ వివరంగా చెప్దామనీ, తన జీవిత భాగస్వామినిగా వుందామని అడుగుదామనీ ఆతనికనిపించినా. అనేక కారణాలవల్ల శేషగిరి సాహసం చెయ్యలేక పోయాడు. ఆ రోజుల్లో వాళ్ళ నాన్న తహసిల్దారుగా వుండేవాడు. పెద్ద మీసాలూ అతనూ చూస్తేనే భయంవేసేది అతనికి దానికి తోడు తన తండ్రికూడ చండశాసనుడే. "కాలేజికి వెళ్ళింది చదువు కోడానికా, స్వయంవరానికిరా, సన్నాసీ! అని ఆయన తప్ప

కుండా కేకలు వేస్తాడని తనకి భయం. ఇవన్నీ కాక, ప్రేమ లాటి ప్రసక్తితెస్తే, "శేషూ! నువ్వు మంచివాడివనుకొని నా అన్నలాగ నిన్ను అభిమానిస్తే ఇదా నీ నిజస్వరూపం!" అని రాగప్రియ కన్నీళ్ళు రాలుస్తుందని ఆతనికి మరో భయం ఈ భయాలన్నీ కలిపి తనకి రాగప్రియని దూరంచేసి, తనకన్నా చాలా తక్కువస్థితిలో ఉన్న ఓ అదృష్టవంతుడికి ఆమెని దగ్గర చేశాయి. అతను ఆమెని ప్రియా ప్రియా అని పిలుస్తూండడం తలచుకుని. స్కౌండ్రల్ అనుకున్నాడు శేషగిరి. అదీకొత్త విషయంకాదు—ప్రియ ఉదంతం అతన్ని వుండీ వుండీ గుచ్చు కున్నట్టు జ్ఞాపకం వొచ్చి బాధిస్తూనే వుంటుంది.

ఇరవై యేళ్ళ సంసారం తరవాత ఇలాటి ఆలోచన తప్పు అని అతనికి మరోబాధ... అప్పటి ప్రియ తన అమ్మాయి పార్వతికన్న చిన్నది...అలా అని అ ఆలోచన మానుకోలేడు!

కాలం అన్ని బాధలనీ వుపశమింపజేస్తుందని అంటారు ...తనకి ఊపిరి తీసుకునే వ్యవధి ఇవ్వకుండా, బి. ఏ. రిజల్టు వొచ్చేలోగానే పెళ్ళి జేసిన తండ్రి, తన ఉద్దేశం ఏమిటి అని అడిగేపాటి ఆలోచన లేనితల్లి, ఒకరి తరువాత ఒకరు స్వర్గానికి వెళ్ళి పోయారు-తల్లి దండ్రుల చాటుగా పెరిగిన శేషగిరి వాళ్ళ కోసం తల్లడిల్లి పోయినా, త్వరలోనే సర్దుకున్నాడు.

కాని, భార్యతో సరిపెట్టుకోలేక పోయాడు ఆమె అందగత్తె కాదనీ చదువుకోలేదనీ, తనకి ఏ కోరికా లేకుండానే ఆమెని పెళ్ళి చేసుకోవాల్సి వొచ్చిందనీ- ఇదేదీ అతని అసంతృప్తికి కారణం కాదు-ఎవ్వరికి చెప్పుకోలేని బాధ అది...

అది ఆమె పేరు.

ఆమె పల్లెటూరి దైనంత మాత్రాన అలాటిపేరు ఆమె ఎందుకు పెట్టుకోవాలి? తన పేరు దగ్గర ఆమెది మరీ హాస్య కారకంగా ఉంది. ఆమెని ఇన్నాళ్ళలోనూ తాను పేరు పెట్టి పిలవలేదు. ఆ శక్తి తనలోలేదు. కాని ఆ పేరు తలుచు కున్న ప్పుడల్లా అతనికి ఏదో బాధ కలుగుతూ ఉంటుంది.

పెళ్ళికి ముందు అమ్మతో చూచాయగా ఆ మాటా అంటే, "అపచారం! వాళ్ళూ మనలాగే శేషగిరి భక్తుల్రా! అయినా పేరులో ఏముందీ!" అనేసి, పిల్లలో ఏదో మహాత్యం ఉన్నట్టు తేలిగ్గాతీసి పారేసింది.

పెళ్ళి అయిన సంవత్సరం దాకా అతనికి ముళ్ళమీద ఉన్నట్టు ఉండేది... ఒకనాడు సాహసించి, "చూడు...నీపేరు మారిస్తే బాగుంటుంది" అని శేషగిరి భార్యతో అనకపోలేదు. ఆమె ఎంతో సిగ్గుపడిపోయి, "నా పేరు మీపేరుతో కలిసిందని మా బామ్మ ఎంతో ముచ్చటపడి పోయిందండీ! అయినా, అలా పేర్లు మార్చుకుంటారుటండీ!... కావలిస్తే రేపు-పుట్ట బోయేవాడికి ఇంకా మంచి పేరు పెట్టుకుందాంలెండి!" అంది. పార్వతి రాకకి మొట్ట మొదటి సూచన అదీ! కుదర గానే ఒకసారి కాశ్మీర్ వెళ్ళి ఆమెతో తిరిగి వొద్దాం అనుకున్న ఆశకి అది అఘాతమైపోయింది.

అంతేకాదు. పార్వతి, మరో రెండేళ్ళకి మహేష్, పుట్టాక ఇంక అలాటి కల లేపికనే ఆవకాశం కూడా లేక పోయింది.

జీవితంలో ఏదో కోల్పోయిన ఒక అసంతృప్తిని ఈ జ్ఞాపకాలు ఉండీ ఉండీ బయటికి తెస్తూవుంటాయి. ఎందుకో, ఈ రోజు కొబ్బరి ఆకుల మధ్యనించి నీలి ఆకాశంలో చంద మామని చూస్తూంటే తొలి యౌవనపు ఆ రోజులూ, ప్రియా, మరీ జ్ఞాపకం వొస్తున్నాయి.

"నాన్నా" అని పిలుపు వినిపించింది.

ఆ గొంతుక పార్వతిది.

ఎక్కడో ఆలోచనల్లోవున్న శేషగిరి వెంటనే పలకలేక పోయాడు— పార్వతి అంటే అతనికి ప్రాణం— కాని, ఈ నిమిషాల్లో ఆమెవొచ్చి ఉండకపోతే బాగుండుననిపించింది.

చివరికి, "ఏమిటమ్మా!" అన్నాడు.

"అన్నం తినడానికి రమ్మంటోంది... అమ్మ" అంది పార్వతి.

"అలాగేలే!– కొంచెంసేపు పోయాక నే వొస్తాను–" అన్నాడు శేషగిరి.

"మరైతే నేను తినేసి నాటకానికి వెళ్తాను ఏం?" అంది పార్వతి.

కొంచెం ఆగి, "సరే" అన్నాడు శేషగిరి. అతనికి పార్వతి నాటకానికి వెళ్ళడం ఇష్టంలేదు. ఎవరో 'ఫ్రెండ్స్'తో వెడతానంది— వాళ్ళెవరో, ఆడవాళ్ళో మగవాళ్లోకూడా తనకి తెలీదు.

పార్వతి అంటే శేషగిరికి ఎంత అభిమానం ఉన్నా ఆ అమ్మాయి అంత స్వేచ్ఛగా తిరగడం ఆమెకి మంచిది కాదని అతనికి దృఢమైన నమ్మకం. వయసులో వున్న అమ్మాయి! రోజులు మారిపోయాయి... ఒకటి రెండుసార్లు చూచాయగా ఆ మాట భార్యతో అంటే, ఆవిడ "పార్వతికేం! బంగారుతల్లి! అది ఎక్కడతిరిగినా, దానికేమీ బెంగలేదు!" అనేసి ఊరుకుంది. అంత ముద్దుగా పార్వతిని పెంచాక ఆమెతో యీ విషయం గురించి చర్చించడం ఎలాగో అతనికి బోధపడలేదు—చివరికి కానీ అని ఊరుకున్నాడు.

అయినా, మాటికి మాటికి పార్వతి విషయం అతనికి భయం కలుగజేస్తూనేవుంది. ఊరికొచ్చిన సినిమాలన్నీ చూడక తప్పదు— కొల్లలుగా వొచ్చేస్తూన్న అడ్డమైన పుస్తకాలూ చదువుతుంది— అనుభవంలేని ఆ వయసులో ఆమె ఏదైనా తప్పుపనిచేస్తే అందరూ తననంటారు. వీలైనంత వేగం పెళ్ళి చేస్తే తనకి బెడద వొదిలిపోతుంది!

నిట్టూర్పు విడిచాడు శేషగిరి— పెళ్ళి— సంవత్సరం తిరగకుండా తనని తాతయ్యని చేసేస్తుంది. ఏమిటో! చిన్నప్పటి కలలింకా పూర్తిగా కరిగిపోకుండానే తాను తాతనవడం అతనికి చాలా అసహ్యంగా తోచింది! అటుచూస్తే నుయ్యా, ఇటుచూస్తే గొయ్యా అన్నట్టు ఉందతని పరిస్థితి. ఏదో ఒక నిర్ణయానికి రాకతప్పదు.

లోపల మహేష్ ఏదో పద్యం వర్ణిస్తూన్నట్లున్నాడు. గణగణ చదువుతున్నాడు. వాడొకడు. అస్తమానమూ చదువే!

'మీవాడికేమండీ! అతి బుద్ధిమంతుడు! కష్టపడి చదువుతాడు!' అంటారు మాష్టర్లు. కాని, వాడు ఉత్సాహంగా ఆటలాడి, ఫుట్ బాల్ లోనూ, క్రికెట్ లోనూ ప్రావీణ్యత సంపాదించాలనీ, తనలాగ కాకుండా ఆధునికంగా, ఆరోగ్యంగా అటు చదువు లోనూ, ఇటు ఆట పాటల్లోనూ మేటిగా ఉండాలనే తన రహస్యమైన కోరిక నెరవేరేలాగలేదు. వాడికి పుస్తకాలే తప్ప ఆట పాటలంటే సరదాలేదు — పోనీ అంటే ఎప్పుడూ చచ్చు పాసేకాని మంచి మార్కుల్తో రేంకు వొచ్చివాడు ప్రకాశించనూ లేదు! పార్వతి నయం-దానికి ఎప్పుడూ మంచి మార్కులు వొస్తూ ఉంటాయి, కాని అదీ తన పీకలమీదికే వొచ్చింది- చదువు మానిపించే ప్రసక్తి వొచ్చినప్పుడల్లా, "దానికేం! చదువుల సరస్వతి! విదేశాలు వెళ్ళికూడా చదువు కుంటున్నారు. ఆడ పిల్లలు- ఊర్లో ఉన్న కాలేజీకి పంపడా నికేం?" అని భార్య దాన్ని వెనకేసు కొస్తుంది!

బాగా పొద్దుపోయింది. శేషగిరి లేచి నిలబడి చిందర వందరగా ఉన్న జుత్తు సర్దుకొని భోజనానికి తయారై వెళ్ళేడు.

ఎప్పటిలాగే, వంటకాలు అట్టేరుచిలేకుండా సామా న్యంగా ఉన్నాయి, అతని భార్యకి వొంట అంత బాగారాదు "చిన్నప్పట్నించి గారాబంగా పెరిగింది- కొద్ది రోజుల్లో అదే నేర్చుకుంటుంది," అని ఓదార్చే అమ్మ జ్ఞాపకం వొచ్చింది. శేషగిరి ఆవిడ నాటికి నేటికి ఒక్కలాగే వొంట చేస్తుంది.

" అమ్మాయి ఎన్ని గంటల కొస్తుంది?"

"పదకొండు అవుతుంది" అంది భార్య.

"నేనెళ్ళి తీసుకొస్తాను - పదిన్నరకి లేపు" అని చెప్పి, కళ్ళు బరువుగా ఉండడాన్న నిద్రకి ఉపక్రమించాడు శేషగిరి. అతను వెళ్ళే అవసరం లేదని ఆమె చెప్పడం అతనికి వినిపించింది కాని అతను జవాబివ్వలేదు.

అతనికి తొందరగా నిద్రపట్టేసింది, నిద్దట్లో ఏదోకల - ముందర ఏమీ తెలిసిరాలేదు.

తెలిసి వొచ్చేసరికి శేషగిరి విచిత్రంగా ఏదోకొత్తరకం విమానంలో ఎగురుతున్నాడు. దానిలో తానూ, రాగప్రియా మాత్రం ఉన్నారు. ఇంజనుది కాబోలు- హోరు వినిపిస్తుంది.

అతనికి రాగప్రియ కనిపించడంలేదు. కాని అతనే ప్రియా, ప్రియా అంటు ఏమిటో మాట్లాడుతూనే ఉన్నాడు. అర్థం చేసుకోలేని ఏదోఒక ఉల్లాసం అతన్నిఆవహించింది.

విమానం కిటికిలోనించి చూస్తే వెన్నెల తప్ప ఇంకేమీ కనిపించడం లేదు. నదులు పర్వతాలు, పట్టణాలూ దీపాలు ఏమి కనిపించవేం? అనిపించింది అతనికి.

"ఎంత ఎత్తున ఎగురుతున్నామో?" అని అతను అడిగాడు.

"చాల ఎత్తుగానూ పదివేలుదాటి పోయినట్టుంది" అంది రాగప్రియ కాని, ఆమె గొంతుకలాగ లేదది, "ఎవరది?" అన్నాడు శేషగిరి.

"అదేమిటండీ నేనే! ప్రియని రాగప్రియని" అంటు ఎక్కడినించో వచ్చి తనకెదురుగా నిలబడింది తన భార్య. ఆ విమానంలో ఆమె తనభార్యఅయినా కాదని ఎందుకనిపిస్తూందో అతనికి తెలియలేదు కాని అతనికి సంతృప్తి ఏదో కలిగింది.

విమానం వెళ్ళి పోతూనే ఉంది. బయట వెన్నెల విరి విగా కాస్తోంది. ఎక్కడో పక్షులు అరుస్తుంటే ప్రియా ప్రియా అన్నట్టు ఉంది.

హటాత్తుగా విమానం రొద ఎక్కువైంది. ఎవరో శేషగిరిని మెడమీద పొడిచారు.

తుళ్ళిపడిలేచాడు శేషగిరి. బయట లారీ ఏదో పెద్ద రొద చేస్తుంది. వెన్నెల అతని ముఖంమీద పడుతుంది.

టైముచూశాడు

పదిన్నర అవుతుంది.

భార్య అటుపక్కగా చాప పరుచుని నిద్రపోతుంది. నిద్రలో ఆమె చిందర వందరగా వికారంగా ఉంది.

శేషగిరి కిటికిలోనించి బయటికి చూస్తూ తనకి వొచ్చిన కలని గురించి ఆలోచించుకున్నాడు. రాగప్రియ ఎందుకు తననింకా వేటాడుతోంది?

ఆ ప్రశాంత సమయంలో ఆ కలలో ఏదో అర్థం ఉన్నట్టనిపించి అతను మరికొంత ఆలోచించాడు. ప్రియ గొంతుకతో కలల్లో తన భార్య మాటలాడినప్పుడు ఆమెని

ప్రియగానే అంగీకరించాడు. రూపాన్నిబట్టి ఆమెని తన భార్య గానూ అంగీకరించేడు.

అంటే, ప్రియకాదు తనని వెంటాడుతోంది.

తానే ప్రియని ఇన్నేళ్ళ తరవాతా మానసికంగా వెంటాడుతున్నాడన్నమాట.

ఆ అలోచన అతనికెంతో ఆశ్చర్యం కలిగించింది. తరువాత తనని తాను పరీక్షించుకునే అలవాటు లేదతనికి.

కాని, ఆ ఆలోచనలో తప్పేమీ కనిపించలేదు. అప్పటి రాగం ఇప్పటి అనురాగంగా, మానసిక ఆరాధనగా ఉంటే ఏం? ప్రియకైనా ఇంకెవరికైనా, ఏమిటి నష్టం?

అతనికి పార్వతి జ్ఞాపకంవొచ్చింది.

లైటువేసి చెప్పులకోసం వెతుకుతోంటే భార్య నిద్ర లేచింది.

"ఏమిటండి?" అంది లేచికూర్చుంటూ

"బైమయింది అలా వెళ్ళి దాన్ని తీసుకొస్తాను," అన్నాడు శేషగిరి.

"మీరు వెళ్ళాలంటే వెళ్ళండి కాని దాన్నెవరో ఒకరు దిగబెట్టక పోరు" అంది భార్య.

అతనేదో అనేలోపున మెడమీద మళ్ళీ ఏదోగుచ్చినట్టు నొప్పి పెట్టింది. అతను చెయి పెట్టి తడిమి ఒక గుండు సూదిని బయటికి లాగేడు.

"అదేమిటండీ" అంది భార్య,

"గుండుసూది..."

ఎలా వచ్చింది? గుచ్చుకుందా?

శేషగిరి నిముషం మాట్లడలేదు, తలుపు తీసి బయటికి అడుగువేస్తూ ఇదీ అన్నిటి లాగే వొచ్చి గుచ్చుకుందిలే. అందుకే నువ్వునిద్ర పోయినా, నాకు తెలివొచ్చింది అన్నాడు,

ఏం విచిత్రం మనిషీ అంటు అతని భార్య మళ్ళీ నిద్రకి ఉపక్రమించిది.